# పత్తి రైతు పరేషాన్..

## సీసీఐ కొర్రీలతో నష్టపోతున్న వైనం

## అధికారుల తప్పిదం.. అన్నదాతకు శాపం..

- ఆన్‌లైన్‌లో నమోదైన విస్తీర్ణాన్ని బట్టి పత్తిని కొనుగోలు చేస్తున్న సీసీఐ
- తక్కువ విస్తీర్ణం నమోదు చేసిన అధికారులు
- ఏఈవో, ఆర్ఐల ధ్రువీకరణ పత్రాలతో పత్తి కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశాలు
- మార్కెటింగ్ సెక్రటరీ ఉండే జిన్నింగ్ మిల్లుల్లోనే అనుమతిస్తున్న సీసీఐ
- కొనుగోలు చేస్తారేమోనని రైతుల పడిగాపులు
- ఇబ్బందులను తట్టుకోలేక దళారులకు తక్కువ ధరకు పత్తిని విక్రయిస్తూ నష్టపోతున్న అన్నదాతలు



వికారాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి రైతుకు చివరకు నష్టాలే మిగులుతున్నాయి. ఓవైపు వ్యవసాయాధికారుల తప్పిదం, మరోవైపు సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొర్రీలతో పత్తి రైతు చిత్తవుతున్నాడు. పంటకు పెట్టిన పెట్టుబడితోపాటు లాభాలు వస్తాయనుకున్న పత్తి రైతులు కష్టాలను ఎదుర్కొంటున్నారు. గత ఏడాది సీజన్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేట్ కొనుగోలు కేంద్రాల్లోనే అధిక ధర ఉండడంతో రైతులంతా ప్రైవేట్ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించారు. ఈ ఏడాది మాత్రం ప్రైవేట్ కేంద్రాల్లో తక్కువ మద్దతు ధర ఉండగా, సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అధిక మద్దతు ధరతో పత్తిని సేకరిస్తున్నారు. దీంతో రైతులంతా సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని విక్రయించేందుకు తీసుకువస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అధిక ధర ఉందని ఆశపడిన పత్తి రైతులకు సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద నిరాశే మిగులుతున్నది. పత్తిని సాగు చేసే సమయంలో వ్యవసాయాధికారులు పంటల నమోదు కార్యక్రమంలో భాగంగా ఏ రైతు ఎన్ని ఎకరాల్లో పండిస్తున్నారనే వివరాలతోనే సీసీఐ రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్నది. పంటల నమోదు కార్యక్రమంలో వ్యవసాయాధికారులు చేసిన తప్పిదాలతో రైతులు అధిక మొత్తంలో పత్తిని సాగు చేసినప్పటికీ.. తక్కువ విస్తీర్ణంలో పత్తిని సాగు చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ప్రస్తుతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో అంతమేరకే పత్తిని సేకరిస్తూ, మిగతా పత్తిని కొనుగోలు చేయడంలేదు.

### పడిగాపులు కాయలేక దళారులకు పత్తి విక్రయం

జిల్లాలో చాలా వరకు 10 ఎకరాల్లో పత్తి సాగు చేసినా కూడా ఆన్‌లైన్‌లో మాత్రం రెండు ఎకరాలు సాగు చేసినట్లు ఉండడంతో మిగతా 8 ఎకరాల్లో వచ్చిన పత్తిని ప్రైవేట్ కేంద్రాల్లో తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొందరు రైతులు కూడా నిర్లక్ష్యంతో వారు సాగు చేసే పంటల వివరాలను వ్యవసాయాధికారులకు తెలుపకపోవడం కూడా ప్రస్తుతం నష్టాలకు కారణంగా చెప్పవచ్చు. పత్తి రైతుల గోస చూసి కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించి వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆర్ఐలు ఇచ్చే ధ్రువీకరణ పత్రాల ఆధారంగా పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆన్‌లైన్ పంటల విస్తీర్ణం నమోదుకాని రైతులకు మేలు జరుగుతున్నది తప్ప ఎక్కువ విస్తీర్ణంలో పత్తిని సాగు చేసినప్పటికీ తక్కువ విస్తీర్ణంలో సాగైనట్లు ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలను మాత్రం మార్చేందుకు వీలు లేకపోవడంతో పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిని కొనుగోలు చేస్తారేమోనని సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్దనే కొందరు రైతులు పడిగాపులు పడుతుండగా, మరికొందరు రైతులు ఏమీ చేయలేక తక్కువ ధరకే ప్రైవేట్ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తూ నష్టపోతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి మద్దతు క్వింటాలుకు రూ.7020 ఉండగా, ప్రైవేట్ కొనుగోలు కేంద్రాల్లో రూ.6600 పలుకుతున్నది. మరోవైపు సీసీఐ కేంద్రాల్లో పడుతున్న ఇబ్బందులతో కొందరు రైతులు గ్రామాల్లోనే రూ.6400లకే దళారులకు పత్తిని విక్రయిస్తూ నష్టపోతున్నారు. ఆరంభంలో అధిక వర్షాలతో కొంతమేర నష్టపోయిన పత్తి రైతులు.. ఇప్పుడు సీసీఐ పెడుతున్న కొర్రీలతో మరింత నష్టపోతున్నారు.

### ఇప్పటివరకు 26,999 క్వింటాళ్ల పత్తి సేకరణ

పత్తిని రైతుల నుంచి సేకరించేందుకు జిల్లావ్యాప్తంగా 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాండూరులో మారుతీ, శుభం, బాలాజీ కొనుగోలు కేంద్రాలు, కోట్‌పల్లిలో సాయిబాబా కాటన్ ఆగ్రో ఇండస్ట్రీస్, పరిగిలో లక్ష్మీ వెంకటేశ్వర, నరసింహ, రాకంచర్ల కాటన్‌మిల్, వికారాబాద్‌లో ధరణి, సాయి బాబా, అయ్యప్ప జిన్నింగ్ మిల్లు, మర్పల్లిలో శ్రీఅయ్యప్ప కాటన్ ట్రేడర్స్, కొడంగల్‌లో విజయ్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలతోపాటు ప్రైవేట్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతేడాది 2.50 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. ఈ ఏడాది 2.80 లక్షల క్వింటాళ్ల పత్తిని సేకరించడమే లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 26,999 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సేకరించారు. అత్యధికంగా తాండూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 17,504 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, కొడంగల్‌లో 5986 క్వింటాళ్లు, వికారాబాద్‌లో 811 క్వింటాళ్లు, కోట్‌పల్లిలో 2551 క్వింటాళ్లు, ధారూరులో 146 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సేకరించారు. పత్తిని విక్రయించిన రైతులకు మూడు రోజుల్లోగా వారి బ్యాంకు ఖాతాల్లో చెల్లింపులను జమ చేస్తున్నారు. ఇప్పటివరకు రైతులు విక్రయించిన పత్తికి సంబంధించి రూ.10 కోట్లమేర చెల్లింపులు చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

#### ఒక్క ఎకరానే నమోదైంది



మేము 4.13 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాం. మంచి దిగుబడి వచ్చింది. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో మంచి ధర ఉందని తీసుకొచ్చాం. ఆన్‌లైన్‌లో కేవలం ఒక్క ఎకరా మాత్రమే నమోదై ఉందని.. ఎకరా విస్తీర్ణంతో వచ్చే పత్తిని మాత్రమే తీసుకున్నారు మిగతా పత్తిని తీసుకోవడంలేదు. రెండు రోజులుగా పడిగాపులు కాస్తున్నాం. అధికారులు చేసిన తప్పిదాలతో రైతులను ఎందుకు ఇబ్బందులు పెడతారు. ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన పత్తి మొత్తాన్ని కొనుగోలు చేయాలి.

**- బర్కత్‌పల్లి శేఖర్, సిద్దులూరు**

---

# రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

- పేదల కోసం కృషి చేయాలి
- కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషం
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- మీర్‌ఖాన్‌పేట్ గ్రామంలో డ్వాక్రా మహిళలకు రుణాలు అందజేత



డ్వాక్రా మహిళలకు రుణాలను అందజేస్తున్న గవర్నర్ తమిళిసై

కందుకూరు, డిసెంబర్ 21 : రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్ గ్రామంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 2047 నాటికి ప్రపంచ దేశాల కంటే అభివృద్ధిలో దేశం ముందుంటుందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వ కృషి చేస్తున్నదని చెప్పారు. తాను ఇక్కడికి రావడం.. అందరినీ కలువడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజల ముఖాల్లో సంతోషం కనిపిస్తున్నదన్నారు. ఈ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేసేలా కృషి చేయాలని సూచించారు. నూతన లబ్ధిదారులను ఎంపిక చేయాలని గవర్నర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆమె క్యాలెండ్‌ను ఆవిష్కరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన పలువురు తమ అభిప్రాయాలను తెలియపరిచారు. పొదుపు సంఘాలకు రుణాల ప్రొసీడింగ్‌ను అందజేశారు. ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య బీమా కార్డులను అందజేశారు. అనంతరం డ్రోన్స్ ప్రారంభించి పనితీరును పరిశీలించారు. అంతకుముందు ప్రజలతో సంకల్ప్ ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో రంగారెడ్డి కలెక్టర్ భారతి హోలీకేరీ, జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ ప్రసాద్, ఎంపీపీ జ్యోతి, జడ్పీటీసీ జంగారెడ్డి, వైఎస్ ఎంపీపీ శమంత, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ రాములు, బీఆర్ఎస్ నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

---

# వైద్యారోగ్య శాఖ అప్రమత్తం

- జేఎన్-1 రూపంలో కరోనా కొత్త వేరియంట్
- ఆసుపత్రుల్లో కొవిడ్ చికిత్సకు ఏర్పాట్లు
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు

రంగారెడ్డి, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : కనుమరుగై పోయిందనుకున్న కరోనా జేఎన్-1 కొత్త వేరియంట్ రూపంలో ప్రజలను భయపెడుతున్నది. రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతానికి ఎటువంటి కేసులు నమోదు కానప్పటికీ జిల్లా వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. కట్టడికి సంబంధించిన ముందస్తు చర్యలను చేపట్టేందుకు ఉపక్రమించింది. కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు అన్ని ఆసుపత్రుల్లో సిద్ధంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కరోనా తీవ్రరూపం దాల్చినా.. అందుకు తగ్గట్టుగా వైద్య సేవలు అందించేందుకు బెడ్లు, మందులను సమకూర్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మాస్కులు ధరించడంతోపాటు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు ఈ సందర్భంగా సూచిస్తున్నారు. కరోనా ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేసే ఏర్పాట్లలో జిల్లా వైద్య శాఖ నిమగ్నమైంది. కొండాపూర్‌లోని జిల్లా కేంద్ర ఆసుపత్రి, వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రితోపాటు జిల్లాలో ఉన్న 37 పీహెచ్‌సీలు, 11 సీహెచ్‌సీలు, 24 అర్బన్ పీహెచ్‌సీలలో కొవిడ్ చికిత్సకు ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైన మేర ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచడంతోపాటు ర్యాపిడ్, ఆర్‌టీపీసీఆర్ టెస్టులను చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

#### సర్వం సన్నద్ధంగా ఉన్నాం



కొవిడ్ నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. కొత్త వేరియంట్ పెద్దగా ప్రభావం చూపదని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ ప్రజలు పూర్తి జాగ్రత్తలు పాటించాలి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. మాస్కులు తప్పనిసరిగా ధరించాలి. లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బెడ్లు సిద్ధం చేశాం. మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. వైద్య సాయం విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**- వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌వో, రంగారెడ్డిజిల్లా**

---

# కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి ఎంపిక



షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 21 : కేంద్ర వయోజన, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి సాహస శిబిరానికి(నేషనల్ అడ్వెంచర్ క్యాంపు) కంటింజెంట్ లీడర్‌గా షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి గురువారం ఎంపికయ్యారు. ఈ క్యాంపు ఈ నెల 30 నుంచి జనవరి 8 వరకు జరగనుందని ఆయన తెలిపారు. ఈ సాహస శిక్షణ శిబిరానికి పాలమూరు విశ్వవిద్యాలయం పరిధి డిగ్రీ కళాశాలల్లోని 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, ఇందులో షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నవీన్ ఎంపికైనట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వయోజన క్రీడల మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో ఉత్తర భారతదేశ రాష్ట్రాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ఎంపిక చేసిన విద్యార్థులకు వారం రోజులపాటు అడ్వెంచర్ క్యాంప్ నిర్వహిస్తున్నదని.. ఈ సంవత్సరం ఈ సాహస శిబిరం హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లా నార్కండ్ వద్ద ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు రావడం ద్వారా దేశంలోని భిన్న సంస్కృతులు, జీవన విధానాలను విద్యార్థులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు ఇలాంటి క్యాంపుల్లో పాల్గొనడం ద్వారా దేశభక్తి, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించే అలవాటు, ఆరోగ్యవంతమైన జీవన అలవాట్లు తెలుసుకోవడంతోపాటు సామాజిక సేవల్లో ఇష్టాలు ఏర్పడుతాయన్నారు. కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి, క్యాంపునకు ఎంపికైన విద్యార్థులను పాలమూరు విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, కళాశాల ప్రిన్సిపాల్ కమల, అధ్యాపకులు అభినందించారు.